# అప్పు ఇచ్చి చూడు

- గుమ్మా నిత్యకళ్యాణమ్మ

"ఒకటా - రెండా?"

"... ... ..."

"పదీ పాతికా కాదు". బాధగా అంది భారతి.

"ఎగనామం పెట్టడానికే వాడు తీసుకున్నాడని నాకేం తెలుసు?" అన్నాను.

మా ఆఫీసులో పది వంది దాకా గుమస్తాలున్నారు. నేను ఆ ఉద్యోగంలో చేరి ఆరేళ్ళైంది. చిన్న ఉద్యోగస్తులకు అప్పులు చేయడం తప్పదు. నేను అందుకు మినహాయింపు కాదు. పదో పాతికో నెలాఖరు రోజుల్లో అప్పు చేస్తూ ఉంటాను. మరీ అవసరమైతే అంతకన్నా పెద్ద మొత్తాలే అప్పులు చేస్తాను. 'కొత్త కేలండరు రాగానే నువ్వు ముందుగా ఏంచేస్తావని ఎవరో తన మిత్రుడ్ని అడిగాడట. పాత బాకీలన్నీ అందులో ఎక్కిస్తాను అని అతడు సమాధానం ఇచ్చేడట'. కాని నేను జీతాలు రాగానే ముందు నెలలో చేసిన అప్పులన్నీ తప్పక తీరుస్తాను.

"ఒరేయ్ వేణూ! నాకు అర్జంటుగా వెయ్యి రూపాయలు కావాలి. పీకల మీద వ్యవహారం" పరమేశ్వరరావు వచ్చి అడిగాడు. వాడు ఏదో పెద్ద ఇబ్బందిలో వున్నట్టు వాడి ముఖం చూడగానే అనుకున్నాను.

ఆరోజు ఇరవై రెండో తారీఖు. మరొకప్పుడైతే 'నా దగ్గర అంత సొమ్ము లేదురా' అని వుండేవాడిని. కాని ఆనాడు వాడితో ఆ మాట అంటే అది అబద్ధమే అవుతుంది. నెలాఖరు రోజుల్లో నా దగ్గర జల్లకొడితే దమ్మిడి ఉండని మాట యదార్థం. బంధువుల ఇంట్లో పెళ్ళి ఉంది. మేం తప్పనిసరిగా వెళ్ళి తీరాలి. రైలు ఖర్చులకే చాలా అవుతుంది. పెళ్ళికూతురికి ఎంతో కొంత చదివించాలి. ఇంకా ఇతర ఖర్చులు, నా భార్యకు సుస్తీగా ఉందని ఒక దొంగ సర్టిఫికేటు జత చేస్తూ ప్రావిడెంట్ ఫండ్ నుంచి లోనుకి అప్లికేషను ముందుగానే ఇచ్చాను. ఆ నాలుగు వేలు అప్పుడే అందుకున్నాను. ఇదీ ఒకందుకు మంచిదే. ఎంత తీసుకువెళ్తే అంతా ఖర్చు అవుతుంది. వీడికి చేబదులుగా ఒక వెయ్యి ఇచ్చానంటే పెళ్ళి నుంచి రాగానే వాడు తిరిగిస్తాడు. బాగా ఆలోచించిన మీదట వాడిని కష్టకాలంలో ఆదుకోవాలనే అనిపించింది.

"మళ్ళీ నెల జీతం రాగానే నీ డబ్బు నీకిస్తాను" అంటూ వాడు వచ్చినంత వేగంగా వెళ్ళిపోయాడు.

పెళ్ళి నుంచి రావడం, మళ్ళీ నెల పదవ తారీఖు వెళ్ళిపోవడం రెండూ జరిగాయి. పరమేశ్వరం దర్శనం మాత్రం కాలేదు. వాడూ నేనూ కలసి బి.ఏ. వరకు చదువుకున్నాం. నేను వ్యవసాయ శాఖలోనూ, వాడు సహకార బ్యాంకులోనూ పనిచేస్తున్నాం.

ఆ డబ్బు మాట భారతికెందుకు చెప్పానా అని బాధపడ్డాను. కొరివితో తల గోక్కోవడం అంటే ఇదే కాబోలు!

నేను తాగిన కాఫీ కప్పును తీసుకొని భారతి ఇంటిలోనికి వెళ్ళింది. వెళ్ళిపోయింది కదా అని సంతోషించలేను. మళ్ళీ వచ్చి మాటల బాణాలు తిరిగి సంధిస్తుంది. వెయ్యి రూపాయలు చిన్న మొత్తం కాదు. ఎవరికైనా ప్రాణం ఉసూరుమంటుంది.

నా ఆలోచనలు గతంలోకి మళ్ళాయి.

* * *

"ఏమండీ! ఆ సినిమా ఇవాల్టితో వెళ్ళిపోతుందట. చూసిన వాళ్ళందరూ బాగుంది అంటున్నారు. మనం కూడా చూసొద్దాం" అంది భారతి.

భారతి ఎప్పుడూ ఏ కోరికా కోరదు. నేను రూపాయి పెట్టి మల్లెపూలు తెస్తే చాలు మహదానందం పడుతుంది. ఇరుగమ్మను పొరుగమ్మను చూసి ఈర్ష్యపడదు. వాళ్ళు కొనుక్కున్న నగలలాంటివి. వారు ధరించిన ఖరీదైన చీరల లాంటివి కొనమని పేచీ పెట్టదు. ఉన్నంతలో సర్దుకుపోతుంది. అందుకనే నాకు నా భార్య అంటే ప్రియం.

నెలాఖరు రోజులు. చేతిలో చిల్లి గవ్వ లేదు. అప్పటికే రెండు వందల రూపాయలు అప్పు చేసి వున్నాను. ఆమె కోరిక తీర్చాలంటే మరో వంద అప్పు చేయాలి.

అప్పు దొరుకుతుందన్న నమ్మకంతో "తప్పకుండా వెళ్దాం. నువ్వు పిల్లల్ని తయారుచేసి రెడీగా ఉండు. నేను అయిదు గంటలుకాగానే వస్తాను" అని అంటూ సైకిల్ ఎక్కాను.

భారతి మనసు పడిన ముచ్చటను డబ్బులేదని తీర్చకుండా ఎలా ఉండగలను? పిల్లలూ సంతోషిస్తారు.

ఒక్కొక్క రోజు వేళా విశేషం.

నేను అడగ్గానే పర్సులో లేకపోయినా బ్యాంకు నుంచి తీసి ఇచ్చే గోపాలరావు గారు ఆ రోజు సెలవులో ఉన్నారు.

మరో ఇద్దరి ముందు చెయ్యి చాచి నిరాశనే

సంపాదించాను.

"క్షమించు బ్రదర్! ఇప్పుడు నా దగ్గర పది రూపాయలు కూడా లేవు. కావాలంటే రేపు ఇస్తాను" అన్నాడు గురునాథం.

రేపు ఎందుకు?

భారతి ఈరోజున సినిమాకు వెళ్దాం అంది. రేపు ఆ సినిమా మారిపోతుంది కూడా.

"సరేలే. వేరొక చోట ప్రయత్నం చేస్తాను." అన్నాను.

రెండవ అతనూ ఇవ్వలేనందుకు చింతిస్తున్నాను అన్నాడు.

నేను తరచు అప్పులు చేస్తానన్న చిన్న చూపో ఏమో? జీతాలు అందగానే తీసుకున్న డబ్బు ఠంచనుగా ఇచ్చేస్తానే. ఆ సంగతి వీళ్ళకు తెలుసునే.

నాకు పని మీద మనసు లగ్నం కాలేదు.

ఎలాగైనా వంద రూపాయలు కావాలి.

నాకంటే తక్కువ జీతగాళ్ళను అడగడానికి మొహమాటం వేసింది. డబ్బు ఇవ్వరు సరికదా ఏదో మాట విసురుతారు.

"అదేంటి మాస్టారూ! మీ కన్నా చిన్న జీతగాళ్ళం. మేమే అప్పుల ఊబిలో కూరుకుపోయేం. మమ్మల్ని అప్పు అడిగి ఎగతాళి చేస్తారా?" అని ఎవరైనా అంటే ఎంత చిన్నతనం?

నాకప్పుడు పరమేశ్వరరావు గుర్తుకొచ్చాడు. వాడు సహాయం చేయగల స్థితిలో వున్నాడని అనిపించింది. అయిదారేళ్ళ అనుబంధం వుంది. మా ఆఫీసుకి దగ్గరలోనే వాడు పనిచేస్తున్న బ్యాంకు ఉంది.

కుశల ప్రశ్నల అనంతరం నేను వచ్చిన పనిని చెప్పాను.

"ఒక గంట ముందు వచ్చి అడిగి ఉంటే ఇచ్చే వాడిని. వంద ఏం ఖర్మ. మూడు నాలుగు వందలైనా సంతోషంగా ఇచ్చేవాడిని. పది నిముషాల క్రితం మా ఆఫీసు ప్యూను తన భార్యకు సుస్తీ చేసింది డాక్టరు దగ్గరకు తీసుకెళ్ళాలి అని అంటే జేబులో వున్న నాలుగు వందలూ ఇచ్చాను. ఇప్పుడు నా పర్సు ఖాళీ" అన్నాడు.

అయిపోయింది.

ఈరోజు భారతి దగ్గర నా పరువు పోతుంది.

కాళ్ళీడ్చుకుంటూ ఆఫీసుకి తిరిగి వచ్చాను.

నా పక్క సీటు అరుణాచలం నన్ను గమనిస్తున్నాడులా వుంది.

"ఎక్కడికెళ్ళావు? డబ్బు కోసమేనా? దొరికిందా?" అంటూ ప్రశ్నలు గుప్పించాడు.

జరిగింది చెప్పాను.

"నువ్వు పరమేశ్వరరావు దగ్గరకు వెళ్తున్నట్టు ముందే నాకు చెప్పి వుండవలసింది. అప్పుడే నిన్ను ఆపేవాడిని. వాడికి అప్పులు తీసుకునే అలవాటే కాని ఇచ్చే అలవాటు లేదు. ప్యూనుకి నాలుగు వందలిచ్చానని నీతో కోత కోశాడు. వాడి కొక్క రూపాయి కూడా ఇచ్చి వుండడు. పందెం" అన్నాడు అరుణాచలం.

గడియారం మీద ముళ్ళు పరుగెడుతున్నాయి. అప్పుడే నాలుగున్నర కావస్తోంది.

ఆ పందేలు నాకనవసరం. వాడు నిజంగా అప్పు ఇచ్చాడో లేక అబద్ధమే చెప్పాడో తేల్చుకున్నందున ప్రయోజనం ఏముంది?

"పరమేశ్వరరావు నీకు స్నేహితుడైతే కావచ్చు. మా పొరుగున వుంటున్నవాడు. అతడు అప్పులెందుకు ఇవ్వడో నీకు తెలుసా?" అన్నాడు ఫైల్స్ దొంతిపెట్టి అల్మారులో సర్దుతూ.

ఆ వివరాలు కూడా నాకు అక్కరలేదు.

నా ధ్యాస అంతా నా కోసం ఎదురుచూస్తున్న భార్యా పిల్లల మీద వుంది. వారికేమని సమాధానం చెప్పాలా అని ఆలోచిస్తున్నాను.

ఏదైనా విషయం చర్చకు వస్తే పూర్తి వివరాలు చెప్పే వరకు నా పక్క సీటు వాడికి మరో పని తోచదు. అంతా కక్కేయాలి. దీన్నే అంటారు పిల్లికి చలగాటం, ఎలుక్కు ప్రాణసంకటం అని.

నాకేదీ వినాలని లేదు. అయినా వినక తప్పదు.

"తను ఎవరికైనా డబ్బు అప్పు ఇచ్చాడనుకో, వాళ్ళు హరీ అంటే అతని డబ్బు గోవిందా అంటుంది. అందుకే అతడు అప్పులివ్వడు. వాన రాకడ, ప్రాణం పోకడ చెప్పలేం కదా అంటాడు. అదీ సంగతి".

నిజంగా నాకు అసహ్యం వేసింది పరమేశ్వరరావు మీద. మరీ ఇంత తుచ్ఛంగా ఆలోచిస్తాడా?

ఒక్కొక్కరే ఇళ్ళకు వెళ్ళిపోతున్నారు.

ప్యూను తాళాలు వేయాలనుకుంటున్నాడు.

నేను లేచి బయటకొచ్చి సైకిల్ తీసుకున్నాను.

ఈ సైకిల్ అమ్మేస్తే?

కాబూలీ వాడి వద్ద అప్పు తీసుకుంటే?

భారతికి ఆ విషయం తెలుస్తే బాధపడుతుంది. ఆమెకు చెప్పకుండా తనలాంటి పనిచేయలేదు.

నేను ధర్మసంకటంలో పడ్డాను.

ఇంటికి వెళ్ళి పెళ్ళాం పిల్లల ముందు చులకన కాలేను.

అనాలోచితంగానే పార్కుకి వెళ్ళాను. ఎంతసేపని ఒంటరిగా కూర్చోగలను? ఎప్పటికైనా ఇంటికి వెళ్ళాలి. ఎప్పుడు వెళ్ళినా తలవంపులు తప్పవు.

వాస్తవం చెప్తాను. భారతి అర్థం చేసుకుంటుంది.

ముందు నుంచీ పొదుపు చేస్తూ వుంటే ఈ తిప్పలుండేవి కావు. పొదుపు చేయండి అంటూ ప్రభుత్వం హెచ్చరిస్తూనే వుంటుంది. తను ఖాతరు చెయ్యలేదు.

కాని పొదుపు చేయడం ఎలా? ప్రతీనెలా అంతో ఇంతో అప్పు చేస్తేనే గాని గడవడం లేదే?



''ఏమండీ! చాలా ఆలస్యం అయింది. ఆఫీసులో అర్జంటు పని తగిలిందా? మీరు వస్తారని ఎదురుచూసి పిల్లలు ఇప్పుడే పక్కలెక్కారు''. అంది భారతి.

చీదరింపు లేదు, కోపం లేదు. ఎంతో సౌమ్యంగా కలవరపడుతూ అడిగింది. బహుశా నేను వేళకు ఇంటికి రానందుకు బాగా బెంబేలు పడి వుంటుంది. నన్ను చూడగానే ఆమె ముఖం విప్పారింది.

అలాంటి భార్యతో అబద్ధం చెప్పడం అన్యాయం. జరిగింది చెప్పాను.

"అయ్యో! ఎంత పనిచేసేరండి. ఆమాత్రం డబ్బు నాదగ్గరుంది. మీరు అనవసరంగా బాధపడ్డారు."

"నీ దగ్గర డబ్బు వుందా?" ఆశ్చర్యంగా అడిగాను. నేను బొటా బొటిగా ఇంటి ఖర్చులకు డబ్బు ఇస్తాను. మరి వంద రూపాయలెక్కడివి?

"మీకు ఇంతవరకు చెప్పలేదు. కొన్ని కొన్ని ఖర్చులు తగ్గించుకొని, మీరిచ్చినదాన్లో ప్రతీ నెలా కొంత మిగులుస్తున్నాను. వంద రూపాయల మేరకు అవసరానికని చేతిలో వుంచుకుని మిగతాది బ్యాంకులో వేస్తున్నాను" అని చెప్పి భారతిలోనికి వెళ్ళి పాసు బుక్ తెచ్చి నాకిచ్చింది.

నాకు సంతోషమే కలిగింది. నేను చేయవలసిన పని ఆమె చేస్తున్నది.

"రెండో ఆటకు వెళ్దాం. కాళ్ళు కడుక్కుని రండి. ఇద్దరం కలసి భోజనం చేద్దాం" అంది.

* * *

వెయ్యి రూపాయల ప్రసంగం అంతటితో ఆగిపోదని నాకు తెలుసు.

"ఔను! ఆనాడు మీరు వంద అడుగుతేనే అతను మీకు మొండి చెయ్యి చూపాడు. పైగా తన దగ్గర అప్పు తీసుకున్నవాళ్ళు ఆ అప్పు తీర్చకుండా చచ్చిపోతే

తన డబ్బుపోతుందని అతను శంకిస్తాడని మీ తోటి ఉద్యోగి చెప్పినట్లు చెప్పారు. మరి అంతా తెలిసి వుండీ మీరతనికి అంత డబ్బు ఎలా ఇచ్చారండీ?" అంది.

భారతిది ఎంత మంచి స్వభావమైనా ఇలాంటి ప్రశ్నలు వేసినందుకు నాకు చికాకు వేసింది.

"భారతీ! అతడా రోజున వచ్చి ఏవో కల్లబొల్లి కబుర్లు చెప్తే అవి నిజమే కాబోలనుకొని జాలిపడి ఇచ్చాను. అతడు దగాకోరని, మొదటికే మోసం చేస్తాడని అనుకోలేదు".

"మీరు వెళ్ళి అడగవచ్చును కదా? ఒకటికి పదిసార్లు అడిగితే అతనే విసుగు పుట్టి ఇచ్చేవాడు".

"ఆ పని నేను చేయలేదనా? నెలకు రెండు మూడు పర్యాయాలు వెళ్ళే వాడిని. ముందు ఇదిగో ఇస్తాను అదిగో ఇస్తాను అనేవాడు. చివరకు నేనే వినుగువుట్టి "ఏంరా! నా డబ్బు సంగతి మరచిపోయావా" అన్నాను. వాడు వెటకారంగా "లేదు, లేదు. కొద్దిగా టైమ్ పడుతుంది అసలీ సంగతి మరిచిపోవడానికి' అన్నాడు. వాడి దగ్గర నుంచి డబ్బు రాబట్టడం కష్టమని నేనే మరచిపోవాలనుకున్నాను. మరచిపోలేక ఆ ముక్క నీ దగ్గర అనేశాను. నువ్వు దాన్ని రాద్ధాంతం చేస్తున్నావు" అన్నాను.

"పరమేశ్వరరావు ముక్కు పిండి నేనా డబ్బు వసూలు చేస్తాను" అంది భారతి.

"భారతీ! నీకు అది సాధ్యం కాదు. వాడెందరికో పంగనామాలు పెడుతున్నాడు. ఆడదానివి, నీ ముఖం చూసి కరిగిపోతాడనుకోకు" అన్నాను.

"నేను చెప్పానుగా. నేను తలచుకుంటే అసాధ్యం కాదది. శతకోటి దరిద్రాలకు అనంత కోటి ఉపాయాలుంటాయి. కావాలంటే పందెం వేయండి" అంది.

పందెం వేయడం వలన నాకు కలిగే నష్టం లేదు. అయితే ఒక వేళ భారతి ఓడిపోతే నాకు బాధ వేస్తుంది.

తిరిగి ఆమె రెట్టించింది.

"అలాగే కాని. నీవు వాడి దగ్గర డబ్బు వసూలు చేయగలుగుతే. అంతా నువ్వే వుంచుకో. కాని పక్షంలో నేనేమీ కోరను" అన్నాను.

* * *

ఆ పందెం ఫలితం సాయంత్రమే తెలుస్తుంది. తొందరగా వచ్చాను.

భారతి ఓటమి ఖాయం అని నా మనస్సులో గిరగిరా తిరుగుతోంది. భారతిని ఓదార్చాలి కాని ఎగతాళి చేయకూడదు అనుకున్నాను.

అయితే ఇంటి దగ్గర చిత్రం నేను వూహించినట్లు లేదు. నేను తలుపు తట్టగానే చిరునవ్వుతో ఆహ్వానించింది. కాళ్ళు కడుక్కుని వచ్చేసరికి స్వీటుతో ప్రత్యక్షమైంది.

"భారతీ, ఈ హొయలు చూస్తూ వుంటే నేను ఓడిపోయినందుకు నీకు సంతోషంగా వున్నట్లుందే!" అన్నాను.

"మీరు ఓడిపోయినందుకు కాదు. నేను గెలిచినందుకూ కాదు. మన డబ్బు మనకు దొరికినందుకు ఈ సంతోషం. ఆడబ్బు నాకు ముట్టింది. మీరు చూస్తూ వుండండి మరో పది నిముషాల్లో పరమేశ్వరరావు తలుపు తట్టుకుంటూ మన ఇంటికి వస్తాడు" అంది.

ఆరు నెలల్లో నేను సాధించలేనిది అరపూటలో ఆమె ఎలా సాధించింది?

"ముల్లును ముల్లుతోనే తీయాలంటారు".

భారతి చెప్పిన విషయం...

* * *

"అన్నయ్యగారూ! నా స్నేహితురాలు అర్జంటుగా హైదరాబాదు వెళ్తూ ఏడు వేలు రూపాయలు నన్ను అడిగింది. బ్యాంకు పది దాటితేనే కాని తెరవరు. ఆ డబ్బుకి సరిపడా చెక్కు ఇస్తాను దాన్ని ఈ రోజే మార్చుకో అంది. నా దగ్గర అంత మొత్తం లేదు. ఆమెను నిరాశ పరచలేను. మా ఎదురింటి ప్రొఫెసరు గారి భార్య నడిగాను. ఆవిడ వద్ద అయిదు వేలున్నాయి. సాయంత్రానికి తిరిగి ఇచ్చే షరతు మీద ఆమె ఇచ్చారు. నా దగ్గర ఉన్న వెయ్యి ఏడు వందలు కలిపి ఆమెకిచ్చాను. ఆ మొత్తానికి నా స్నేహితురాలు చెక్కు ఇచ్చింది".

"మీకు తొందరగా డబ్బు కావాలా? చెక్కు వెనుక సంతకం చేసి ఇవ్వండి. రెండు నిముషాల్లో డబ్బు తెచ్చి ఇస్తాను" అన్నాడు పరమేశ్వరరావు.

"నాకేం తొందరలేదు. ఆమె ఎకౌంట్‌లో అంత మొత్తం లేదు. కాస్త తక్కువ వుంది" అంది భారతి.

"చూశావా ఎంత గడుసుగా ఆమె నిన్ను మోసగించిందో?"

"అబ్బే! అది మోసగించే మనిషి కాదు. బహుశా ఆమెకు ఎంత వుందో అంచనా లేదు. ఇప్పుడు నేను పెద్ద చిక్కులో ఇరుక్కున్నాను. ప్రొఫెసరు గారి భార్యకు సాయంకాలానికల్లా అయిదు వేలు ఇస్తానన్నాను. సమయానికి ఆయన కూడా వూర్లో లేరు. మీరు నాకో సహాయం చేయాలి" అంది ఆమె.

"ఏమిటి?"

"నాకు అయిదు వేలు దొరికినా చాలు. ప్రొఫెసరు గారి భార్య దగ్గర మాట పడవలసి రాదు. ఈ ఎమౌంట్‌ని అయిదు వేలకు మారుస్తాను. కాని కౌంటరులోని వ్యక్తి అలా కుదరదు. దిద్దుబాట్లు వుంటే

ఖాతా ఆసామి సంతకం కావాలంటున్నాడు. మీరు చెప్తే అతను కాదనడు. మీరీ సహాయం చేయాలి" అంది.

"కౌంటరులో అతను చెప్పింది నిజమమ్మా, నేను బ్యాంకు ఉద్యోగినైనా ఆపని చేయలేను".

"అయితే పెద్ద చిక్కే వచ్చింది. ఇప్పుడు నేనేం చేయాలి. ప్రొఫెసరు గారి భార్యకు డబ్బు తిరిగి ఇవ్వకపోతే నా పరువు పోతుంది. మీ చెల్లెలు లాంటిదాన్ని. రూల్సు మాబోటివాళ్ళకు కాని మీలాంటి వారికి కావు" అంది ఏడుస్తూ భారతి.

"కుదరని పని"

"మరో మార్గం లేదా?"

"మీ దగ్గరున్న చెక్కు ఎంతకు రాసి వుంది?"

"ఆరు వేల ఏడు వందలు"

"ఆమె ఖాతాలో ఎంత వుందో తెలుసా?"

"ఊ. అయిదు వేల ఏడు వందల అయిదు రూపాయలు".

"అయితే సునాయాసంగానే ఈ చెక్కు ద్వారా మీకు అయిదు వేలు దొరికే వీలు వుంది."

"ఎలా! అదేదో చెప్పి పుణ్యం కట్టుకోండి"

"చెల్లెమ్మా! నువ్వు ముందు ఓ పదమూడు వందలు ఆమె ఖాతాలో జమ కట్టు. అప్పుడు అందులో ఏడు వేల పైన వుంటాయి. నువ్వు ఆరు వేల ఏడు వందలు తీసుకోగలవు".

"అయ్యో! మీకెలా చెప్పేది. ఇంట్లో వున్నదంతా వూడ్చి ఇచ్చాను. పోనీ ఎవరి వద్దనైనా తీసుకుని కట్టాలనుకున్నా నేను తిరిగి వచ్చేసరికి సమయం దాటిపోతుంది. అన్నయ్య గారూ! ఈ ఆపద నుంచి మీరే నన్ను గట్టెక్కించాలి. ఆ పదమూడు వందలూ మీరు ఇవ్వండి. డబ్బు తీసుకుని మీకు ఇచ్చేస్తాను".

"చెల్లెమ్మా! మరెప్పుడూ ఇలాంటి ఇరకాటాల్లో పడకు. నీవు అంతగా ప్రాధేయపడుతున్నావు. ఆ డబ్బు నేనిస్తాను. డబ్బు నీకందగానే నేను ఇచ్చింది తిరిగి ఇచ్చేయి. ఆ డబ్బు నాది కాదు వేరొకరిది" అన్నాడు.

"అయ్యో! ఇంత సహాయం చేసిన మీ మేలు ఎలా మరిచిపోతాను? డబ్బు దొరికిన మరుక్షణం మీ డబ్బు పువ్వుల్లో పెట్టి మీకిస్తాను" అంది భారతి.

* * *

"చాలా టైమ్ గడిచిపోయింది కదా! మీ దగ్గర డబ్బు తీసుకున్న విషయం అది తీర్చాలన్న విషయం అతడు నిజంగా మర్చిపోయి వుంటాడు" భారతి నవ్వుతూ అంది.

"అంటే పరమేశ్వరరావుకి ఆ పదమూడు వందలూ ఇవ్వకుండా వచ్చేశావా? అలాగే ప్రొఫెసరు గారి భార్యనూ దగా చేశావా? ఇంతకూ నీకు చెక్కు ఇచ్చిన ఆ స్నేహితురాలెవరు?" అడిగాను.

"చెక్కూ లేదు స్నేహితురాలూ లేదు. నా చెక్కు మీదే ఆ అంకె రాసి దొంగ సంతకం పెట్టాను పరమేశ్వరరావును బోల్తా కొట్టించడానికి. అతని దగ్గర పదమూడు వందలు తీసుకుని తిన్నగా రిక్షా ఎక్కేశాను. ఆ డబ్బు కోసం అతను వచ్చే వేళ అయింది" అంది భారతి.

"చెల్లెమ్మా!" అంటూ పరమేశ్వరరావు తలుపు కొట్టాడు.

"రండి అన్నయ్యగారు! మీరు వస్తారని అనుకుంటూనే వున్నాను" అంది చిరునవ్వుతో భారతి.

"రాక తప్పుతుందా! నువ్వు నా డబ్బు ఇవ్వకుండా బ్యాంకు నుంచి వచ్చేశావు. నా డబ్బిస్తే నేను వెళ్తాను.

పరమేశ్వరరావు నన్ను చూసి ఆశ్చర్యపోయాడు.

"నువ్వెప్పుడొచ్చావు? నువ్వు వూర్లో లేవందే చెల్లెమ్మ".

"అన్నయ్య గారు! నేను బ్యాంకులో ఆడిందంతా ఒక నాటకం".

"నాటకమా?"

"మీరు ఆరు నెలల క్రితం ఏదో పీకల మీద వ్యవహారం అంటూ మా వారి దగ్గర వెయ్యి రూపాయలు అప్పు తీసుకున్నారు. మీరు ఆ డబ్బు తిరిగి ఇవ్వలేదు. మా వారు గత మూడు నెలలుగా అడగలేదు కాబట్టి వాడు మరిచిపోయి వుంటాడులే అని మీరనుకున్నారు. ఆ డబ్బు మీ దగ్గర నుంచి వసూలు చేయడానికి ఓ చిన్న నాటకం ఆడేను. మీకు చూపించింది నా స్నేహితురాలిచ్చిన చెక్కు కాదు. అది నా చెక్కు పుస్తకంలోనిదే. మీరు నా ఉచ్చులో పడి పదమూడు వందలు ఇచ్చారు. మా వెయ్యి రూపాయలు పోగా ఇవిగో మిగిలిన మీ మూడు వందలు.

మనుషులన్న తరువాత అవసరాలు వస్తూ వుంటాయి. అప్పు చేయడం తప్పు కాదు. సకాలంలో తీర్చాలి. మీరు అప్పులు తీసుకుంటారు కాని అస్సలు అప్పులీయరట. అలా అప్పు ఇస్తే అవతలి వాడు తీర్చకుండా చచ్చిపోతే మీ డబ్బు పోతుందని మీ భయమట. ఇతరుల గురించి చెడు తలంచడం, ఇతరులను ఉసురు పెట్టడం మానవత్వం కాదు. ఏమంటారు?" అంది భారతి.

పరమేశ్వరరావు నోట మాట రాలేదంటే నేను అబద్ధం చెప్పినట్లే అవుతుంది.

"నేను వస్తానురా" అన్నాడు.

ఇంత దూరం వచ్చావు. కాఫీ తాగి వెళ్ళు అన్నా వాడు ఆగలేదు.